నటుడు నారాయణ మూర్తికి కేటీఆర్ పరామర్శ

ఖైరతాబాద్, జూలై 20: సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణ మూర్తిని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్‌లో పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం కారణంగా నారాయణ మూర్తి నిమ్స్ దవాఖానలో చికిత్స తీసుకున్నారు.

మేడ్చల్ అదనపు కలెక్టర్‌గా రాధికా గుప్తా

మేడ్చల్, జూలై 20(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా రాధికా గుప్తాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హన్మకొండ నుంచి మేడ్చల్ జిల్లాకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా రాధికా గుప్తాను ప్రభుత్వం నియమించింది.

సీడీఎఫ్‌డీని సందర్శించిన ఐకేపీ బృందం

ఇంక్యుబేషన్ విధానాల పరిశీలన

సిటీబ్యూరో, జూలై 20(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నొస్టిక్స్ ఇంక్యుబేషన్ సెంటర్‌కు విశేష ఆదరణ వస్తున్నది. లైఫ్ సైన్సెస్ స్టార్టప్‌లను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రారంభించిన అతి తక్కువ సమయంలోనే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చేరువుతుంది. తాజాగా ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఐకేపీ నాలెడ్జ్ పార్క్ బృందం సందర్శించింది. ఇప్పటికే పదుల సంఖ్యలో స్టార్టప్‌లు కార్యకలాపాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో, ఐకేపీ నాలెడ్జ్ పార్క్ బృందం సందర్శన యువ పారిశ్రామికవేత్తలు వినూత్న ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావడంలో సహకరిస్తుందని సీడీఎఫ్‌డీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో సెంటర్‌ను పరిశీలించి బయోటెక్నాలజీ రంగంలో వినూత్న ఆవిష్కరణలను తీసుకువచ్చేలా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సాహిస్తామని ఐకేపీ బృందం పేర్కొంది. అదే విధంగా టెక్నాలజీ మార్పిడి, ఉత్తమ ఇంక్యుబేషన్ విధానాలపై ఇరు వర్గాల మధ్య చర్చ జరిగినట్లుగా సీడీఎఫ్‌డీ పేర్కొంది.

ఆడిట్ చేయలేదట.. రుణమాఫీ కాదట!

- మేడ్చల్ జిల్లాలో మూడు సహకార సంఘాల రైతులకు అందని ద్రాక్ష
- రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- తొమ్మిది సహకార సంఘాలలో ఇదే పరిస్థితి
- గత ప్రభుత్వ తీరే నయమంటున్న రైతాంగం

మేడ్చల్, జూలై 20(నమస్తే తెలంగాణ)/కీసర: ఆడిటింగ్ సాకుతో రుణమాఫీ వర్తింపు నిలిపివేతపై రైతులు ఆందోళన చెందుతున్నారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో మూడు సహకార సంఘాల పరిధిలోని రైతులకు రుణమాఫీ వర్తింపజేయకపోవడంపై మండిపడుతున్నారు. జిల్లాలో బౌరంపేట్, దూలపల్లి, డబీల్‌పూర్, మేడ్చల్, కీసర, శామీర్‌పేట్, పూడూర్, ఘట్‌కేసర్, అల్వాల్‌లలో సహకార సంఘాలు ఉన్నాయి. అయితే, ఆడిటింగ్ సాకుతో పూడూర్, ఘట్‌కేసర్, అల్వాల్ సహకార సంఘాల 2,714 మంది రైతులలో ఏ ఒక్కరికి రుణమాఫీ దక్కలేదు. సహకార సంఘాలలో ప్రతి ఆరు నెలలకోసారి ఆడిటింగ్ తప్పని సరిగా చేయాల్సి ఉంటుంది. కాగా, మూడు సహకార సంఘాలలో ఆడిటింగ్ చేసిన రైతులకు రుణమాఫీ ఎగ్గొట్టేందుకే ఆడిటింగ్ సాగు చూయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రుణమాఫీ పొందే రైతులు అధిక సంఖ్యలో ఉన్న రుణమాఫీ పొందిన రైతుల సంఖ్య తక్కువేనని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. బౌరంపేట్ సహకార సంఘం పరిధిలో 632 మంది రైతులు ఉంటే 11 మందికి మాత్రమే రుణమాఫీని వర్తింపజేశారు. దూలపల్లిలో 109 మంది రైతులకు 51, దూలపల్లిలో 615 మంది రైతులకు 233, మేడ్చల్‌లో 524 మంది రైతులకు 235, కీసరలో 699 మంది రైతులకు 194, శామీర్‌పేట్‌లో 48 మంది రైతులకు 29 మందికి మాత్రమే రుణమాఫీ వచ్చినట్లు తెలుస్తుంది. రుణమాఫీ రాని రైతులు స్థానిక సహకార సంఘాల బ్యాంకులకు ఫోన్లు చేసినా స్పందన లేదని ఆరోపిస్తున్నారు.

రుణమాఫీని ఎగ్గొటే ప్రయత్నం

ఆడిటింగ్ సాకుతో మూడు సహకార సంఘాల పరిధిలోని రైతులకు రుణమాఫీని కాంగ్రెస్ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుంది. పూడుర్ సహకార సంఘం పరిధిలో 114 మంది రైతులు, ఘట్‌కేసర్ సంఘ పరిధిలో 1200, అల్వాల్ పరిధిలో 1400 మంది రైతులలో ఏ ఒక్కరికి రుణమాఫీ చేయకుండా ఆడిటింగ్ సాకుతో రుణమాఫీ ఇవ్వలేదని చెప్పడం ఎంత వరకు సమంజసం. ఆడిటింగ్‌ను ప్రతి ఆరు నెలలకొకసారి చేసిన ఈ మూడు సహకార సంఘాల రైతులకు ఎందుకు పెండింగ్ పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయకుండా ఏదో ఒకటి చెప్పి తప్పించుకోవాలని చూస్తున్నదన్నారు. రుణమాఫీ పథకం అందరి రైతులకు అందజేయకపోతే జిల్లా కలెక్టరేట్‌ను రైతులతో కలిసి ముట్టడిస్తాం. రూ.లక్ష రుణమాఫీ పొందే రైతులు అధిక సంఖ్యలో ఉన్నా సగానికి సగంకు పైగా రైతులకు రుణమాఫీ కాలేదు.

– డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి

రుణమాఫీ చేయక.. రైతులకు ఇక్కట్లు

కీసర మండల ప్రాథమిక సహకార సంఘం నుంచి మొత్తం 553 మంది రైతుల జాబితాను రుణమాఫీ కింద ప్రభుత్వానికి నివేదిక పంపించాం. 553 మంది రైతులకు గాను 194 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ లభించింది. మిగతా రైతులంతా వారి కార్యాలయానికి వచ్చి మాకు రుణమాఫీ ఎప్పుడు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నరు. ఫోన్లల్లో సతాయిస్తున్రు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఒకేసారి రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం లక్ష రూపాయల రుణమాఫీకి నానా ఇబ్బందులకు గురి చేస్తున్నది. మండల రైతుల బాధలు వర్ణనాతీతం. లక్ష రూపాయల రుణమాఫీ అర్హులైన మొత్తం రైతులకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నానా సాకులు చెబుతుంది. వచ్చే నెల మొదటివారంలో మిగతా రైతులకు రుణమాఫీ చేస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రుణమాఫీ పేరిట నానా ఇబ్బందులకు గురిచేస్తుంది.

– రామిడి ప్రభాకర్ రెడ్డి, చైర్మన్, కీసర మండల ప్రాథమిక సహకార సంఘం

సివిల్స్ కోచింగ్‌కు రిప్లెక్షన్ ఉచిత వసతి

సిటీబ్యూరో, జూలై 20(నమస్తే తెలంగాణ): సివిల్స్ కోచింగ్ తీసుకునే అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామని రిప్లెక్షన్ ఐఏఎస్ అకాడమీ ఫౌండర్ డా. జి.వివేకానంద తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మాజీ ఐఏఎస్ అధికారి జయ ప్రకాశ్ నారాయణ ఆవిష్కరించారు. ప్రతి ఏటా అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తున్నామని వివరించారు. ఆర్థికంగా వెనకబడిన వారికి హాస్టల్ ఖర్చులు భారం కాకూడదని చెప్పారు. సామాజిక బాధ్యతతో కాకతీయ ఎడ్యుకేషన్ అకాడమీ సహకారంతో 90 మంది అభ్యర్థులకు హాస్టల్ వసతి కల్పిస్తున్నామని వివరించారు. మెరిట్ ప్రాతిపాదికన ఎంపిక చేస్తామని చెప్పారు. ఇందులో బాలురు 45, బాలికలు 45 తీసుకుంటామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి వివరాలను ఫోన్ నం. 98660 74047కు పంపించగలరని సూచించారు.

సాధన స్రవంతి సంపుటిల ఆవిష్కరణ

గరికపాటి ప్రభాకర్ రచించిన 'సాధన స్రవంతి' సంపుటిలు సంగీతాన్ని సులభతరంగానే నేర్చుకోవచ్చున్న అవగాహన కలుగుతుందని ప్రఖ్యాత సీని గీత రచయిత జొన్న విత్తుల రామలింగేశ్వర్ రావు అన్నారు. చిక్కడపల్లిలోని శ్రీ త్యాగారాయగాన సభలో ఎస్ఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రభాకర్ రచించిన 'సాధన స్రవంతి' రెండు భాగాలు ఆవిష్కరణ సభ జరిగింది. ఇందుకు ముఖ్య అతిథిగా హాజరైన జొన్నవిత్తుల రామలింగేశ్వర్‌రావు పుస్తకాలను ఆవిష్కరించారు. మృదంగం నిపుణులు రామచంద్ర శర్మ, చిత్రకారిణి నీలిమ పాల్గొన్నారు. – చిక్కడపల్లి;

వెండర్ నమోదులో నిబంధనలు సడలించాలి

విద్యుత్ విభాగంలో కాంట్రాక్టర్లు

విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీని కలిసిన కందుకూరి శ్రీనివాస్ తదితరులు

సిటీబ్యూరో, జూలై 20(నమస్తే తెలంగాణ): విద్యుత్ శాఖలో పనులు చేసే కాంట్రాక్టర్ల కోసం ప్రత్యేకంగా ప్రవేశ పెట్టిన వెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉన్న నిబంధనలను సడలించాలని తెలంగాణ ఎల్క్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కందుకూరి శ్రీనివాస్ కోరారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీను అసోసియేషన్ ప్రతినిధుల బృందం కలిసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు కందుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యుత్ శాఖలో 20–30 ఏళ్లుగా కాంట్రాక్టర్లుగా పనిచేస్తూ అన్ని రకాల విద్యుత్ నెట్ వర్క్‌లను చేపడుతున్నాం. విద్యుత్ వినియోగదారుల అవసరాల మేరకు టర్న్ కీ కాంట్రాక్టర్లుగా పనిచేస్తూ విద్యుత్ శాఖకు ఎంతో ఆదాయాన్ని తీసుకువస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా ప్రవేశ పెట్టిన వెండర్ రిజిస్ట్రేషన్ విధానంతో చాలా మంది కాంట్రాక్టర్లు పనులు చేసే అర్హతను కోల్పోతున్నారు. కొత్తగా తీసుకువచ్చిన వెండర్ విధానం ద్వారా చాలా మంది కాంట్రాక్టర్లకు పనులు చేసే అర్హత దక్కడం లేదని, దీని వల్ల చాలా మంది పనిని కోల్పోతారు. ఎన్నో ఏండ్ల అనుభవం, ఎన్నో పనులు చేసిన కాంట్రాక్టర్లను నిబంధనల పేరిట అనర్హులుగా వేటు వేయడం సరికాదని, కేటగిరీల వారీగా అనుభవం, లైసెన్సు ఉన్న కాంట్రాక్టర్లను వెండర్లుగా నమోదు చేసుకునే అవకాశ కల్పించాలని సీఎండీని కోరామని శ్రీనివాస్ తెలిపారు. సీఎండీని కలిసిన వారిలో తెలంగాణ కాంట్రాక్టర్స్ జనరల్ సెక్రెటరీ మద్దునూరి వెంకటేష్, కోశాధికారి ఎస్.నాగయ్య, సలహాదారు మహారాజ్, సంయుక్త కార్యదర్శి గడిగ సత్యనారాయణలు ఉన్నారు.

ఆర్టీసీ ఆసుపత్రికి అధునాతన యంత్రాలు..

ఆర్టీసీ ఆసుపత్రిలో నూతన ఎంఆర్ఐ పరికరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో నూతనంగా నెలకొల్పిన వివిధ అధునాతన యంత్రాలు, సదుపాయాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ప్రారంభించారు. ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌తో కలిసి ఆయన అధునాతన సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరికరాలతో పాటు ఫిజియోథెరపీ యూనిట్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, ఫార్మసీలను ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి అంతా కలియతిరిగారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీవోవో డాక్టర్ విశ్వనాథ్ రవీందర్, ఇతర ఉన్నతాధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజామూర్తి, మెడికల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

– ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 20;

ఈసీజీని వైద్యులు సరిగా అర్థం చేసుకోవాలి

కిమ్స్ ఆసుపత్రి ఎలక్ట్రో ఫిజియాలజి అధినేత డా. హయగ్రీవారావు

కిమ్స్ ఆసుపత్రిలో సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

బేగంపేట్ జూలై 20: గుండెకు సంబంధించిన అత్యంత ప్రాథమిక పరీక్ష అయిన ఈసీజీని డాక్టర్లు సరిగ్గా అర్థం చేసుకొని విశ్లేషిస్తే రోగికి ఉన్న హృదయ సమస్యలన్నింటిని గుర్తించి సరియైన వైద్యం అందించవచ్చునని కిమ్స్ ఆసుపత్రి ఎలక్ట్రో ఫిజియాలజి, ఫేసింగ్, విభాగం అధినేత డాక్టర్ హాయగ్రీవరావు తెలిపారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో గుండే సంబంధిత వ్యాధులపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఢిల్లీ, బెంగుళూర్, చెన్నైతో పాటు తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ హయగ్రీవారావు మాట్లాడుతూ, భారత దేశంలో తరచుగా అనేక మందికి వచ్చే గుండు సమస్యల్లో 50–55 ఏళ్ల మధ్య వయస్సులో ఉండే వారికి అధిక రక్తపోటు, మధుమేహం అదుపులో లేక పోయిన గుండె సంబంధిత సమస్యలు వస్తాయన్నారు. ఫిజీషియన్లు, కార్డియాలజిస్టులు ఈసీజీని సరిగ్గా అర్థం చేసుకొని విశ్లేషించి సరైన చికిత్స విధానం ఏంటనేది నిర్ధారిస్తే గుండె వైఫల్యం కేసుల్లో అత్యాధునికంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి హఠాన్మరణాలను నివారించవచ్చని అన్నారు.

ర్యాపిడో యాప్ నుంచి మెట్రో రైలు టిక్కెట్ బుకింగ్

ర్యాపిడో యాప్ నుంచి మెట్రో రైలు టికెట్ బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని ప్రారంభిస్తున్న ఎల్ అండ్ టీ మెట్రో రైలు ఎం.డీ, సీఈఓ కేవీబీ రెడ్డి తదితరులు

సిటీబ్యూరో, జూలై 20(నమస్తే తెలంగాణ): ర్యాపిడో యాప్ నుంచే మెట్రో రైలు టిక్కెట్ బుకింగ్ సౌకర్యాన్ని ఎల్ అండ్ టీ మెట్రో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎల్ అండ్ టీ మెట్రో రైలు ఎం.డీ, సీఈఓ కేవీబీ రెడ్డి శనివారం ఈ సేవలను ప్రారంభించారు. నగరంలో ఏకీకృత రవాణాను పరిష్కరించడానికి ర్యాపిడోతో భాగస్వామ్యమయ్యామని, ఇంటి నుంచి మెట్రో స్టేషన్ దాకా ర్యాపిడో బైకు, ఆటో, కారులో వచ్చిన వారు అక్కడి నుంచి నేరుగా మెట్రోలో ప్రయాణించేందుకు అవసరమైన మార్గంలో టిక్కెట్‌ను సులువుగా బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ర్యాపిడో వ్యవస్థాపకులు పవన్ గుంటుపల్లి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో 65 వేల మంది ర్యాపిడో సేవల కెప్టెన్లు ఉన్నారని, ప్రతి రోజు రెండు లక్షల రైడ్‌లను అందిస్తున్నామన్నారు. నగరవాసుల ప్రయాణాన్ని సులభతరం చేసేలా ఒప్పందం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ మెట్రో రైలు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధీర్, ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ హెడ్ బిభు దత్త మిశ్రా పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా స్టైల్ తత్వ

ప్రముఖ యాంకర్ సుమ కనకాల

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ యాంకర్ సుమ కనకాల

మాదాపూర్, జూలై 20: ఎంఎస్ఎంఈలను సమీకరించడంతో పాటు ఇటువంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రముఖ యాంకర్ సుమ కనకాల అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శనివారం మహిళా సాధికారత, ఎంఎస్ఎంఈ ప్రమోషన్ లక్ష్యంగా గల ఫిక్కీ ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ ఆధ్వర్యంలో స్టైల్ తత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇందుకుగాను ఏర్పాటు చేసిన ఎక్స్‌పోకు ముఖ్య అతిథిగా సుమ కనకాల విచ్చేసి ఎంఎస్ఎంఈ, రిటైల్ డైరెక్టర్ వత్సలా మిశ్రాలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 200లకు పైగా ఎంఎస్ఎంఈ లను సమీకరించడంతో పాటు ఇటువంటి ప్రదర్శనలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం, ఎంఎస్ఎంఈ, రిటైల్ డైరెక్టర్ వత్సలా మిశ్రా మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వ గ్లోబల్ లింకర్ ప్లాట్‌ఫామ్‌లో ఒకరికొకరు మద్దతుగా నిలిచి ఒకరి ఆలోచనలను ఒకరు పంచుకునేందుకు మంచి వేదికని, ఈ విధంగా అందివచ్చిన అవకాశాలను యువత, వ్యాపార, పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 212 స్టాల్స్ ఏర్పాటు చేయగా, 200 మందికి పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయి. రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 8 వేల నుంచి 10 వేల మంది వరకు సందర్శకులు విచ్చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఇందులో 75 శాతం మంది ఎగ్జిబిటర్లు 15 రాష్ట్రాల నుంచి అన్ని తరహా కంపెనీల ప్రతినిధులు ఉన్నట్లు తెలిపారు.

ఓయూ టెక్నాలజీలో బీటెక్ ఆనర్స్

వివరాలు వెల్లడించిన ప్రిన్సిపాల్ ప్రొ. చింత సాయిలు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 20: ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ కళాశాలలో నూతనంగా పలు కోర్సులను ప్రవేశపెట్టారు. మారుతున్న పరిస్థితులు, సాంకేతికతకు అనుగుణంగా పరిశ్రమ అవసరాల రీత్యా నూతన కోర్సులకు శ్రీకారం చుడుతున్న తరుణంలో, కొత్తగా పరిస్థితులకు అనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టాలని అధికారులు నిర్ణయించారు. అధికారుల నిర్ణయంతో ఇప్పటికే వివిధ అరుదైన కోర్సులతో దూసుకుపోతున్న కళాశాల కీర్తి కిరీటంలో మరిన్ని కలికితురాయిలు చేరనున్నాయి. ఈ వివరాలను శనివారం నిర్వహించిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత సాయిలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరం నుంచి బీటెక్ ఆనర్స్ కోర్సును ప్రవేశపెట్టినట్లు వివరించారు. బీటెక్ ఆనర్స్ కోర్సును ప్రవేశపెట్టినప్పటికీ, అదనంగా ఈ కోర్సులో ఎవరినీ చేర్చుకోబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే కళాశాలలో బీటెక్ అభ్యసిస్తున్న వారిలో తమ పాఠ్య ప్రణాళికకు అదనంగా సబ్జెక్టులను చదివి అదనపు క్రెడిట్లు సాధించిన వారికి బీటెక్ ఆనర్స్ పట్టాను ప్రదానం చేయనున్నట్లు వివరించారు. 2023–24 విద్యాసంవత్సరానికి గాను నలుగురు విద్యార్థులకు ఈ పట్టాలను అందించనున్నట్లు తెలిపారు. కెమికల్ ఇంజినీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ విభాగాల్లో డిప్లమాలు పూర్తి చేసి, ఆయా రంగాల్లో పనిచేస్తున్న వారి కోసం ప్రత్యేకంగా బీటెక్ కోర్సులను ఈ ఏడాది (2024–25 విద్యా సంవత్సరం) నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే కళాశాలలో విద్యార్థుల సౌలభ్యం కోసం ఏఆర్‌డీఐ, ఎంఎస్ఎంఈ – ఎంఐ, ఐపీఈసీ, ఐపీఆర్ కేంద్రాలను ప్రారంభించినట్లు వివరించారు. దాంతో ఈ ఏడాది కళాశాలలో దాదాపు 90 శాతానికి పైగా విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ లభించాయని చెప్పారు.

కళాశాల బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఎన్నిక

టెక్నాలజీ కళాశాల నూతన బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్‌ను శనివారం ఎన్నుకున్నారు. కళాశాలలో నిర్వహించిన సమావేశంలో నూతన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బోర్డు చైర్మన్‌గా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కశ్మీర్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఏ.రవీంద్రనాథ్, సభ్యులుగా భారత రక్షణ శాఖ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లేబోరేటరీ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్, రైమ్ ఆర్గానిక్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ ఎండీ రాజమహేందర్ రెడ్డి, సభ్యులుగా హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ నరసింహ మంగదొడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత సాయిలు, ఫ్యాకల్టీ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ వీవీ బసవరావు, కళాశాల డిప్యూటీ రిజిస్ట్రార్, ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

నగరంలో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉన్నది. జల్లులా మొదలైన వాన, అప్పుడప్పుడూ ఉధృతంగా పడింది. రోజంతా కురుస్తూనే ఉండగా నగరవాసులు ఇక్కట్లకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయంగా కాగా, చాలా ప్రాంతాలలో వరద నీరు నిలిచిపోయింది. రహదారులపై వాహనాలు మొరాయించాయి.

డిగ్రీ లెక్చరర్ల బదిలీల్లో అవకతవకలు.. ఆందోళన

జూబ్లీహిల్స్, జూలై 20: గురుకుల డిగ్రీ లెక్చరర్ల బదిలీల్లో అవకతవకలపై ఆందోళన వ్యక్తమవుతుంది. మల్టీ జోన్–1, మల్టీ జోన్–2ల మధ్య నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ట్రాన్స్‌ఫర్లపై సంబంధిత ఉపాధ్యాయులు నిరసన గళం వినిపిస్తున్నారు. బదిలీల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ శనివారం బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారా భవన వద్ద ఆందోళనకు దిగారు. 317 డిస్‌లోకేషన్ ముసుగులో జనరల్ ట్రాన్స్‌ఫర్లు చేయడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వెబ్ ఆప్షన్లు పెట్టుకున్న వారిని రద్దు చేసి వేరే జోన్‌లలోకి మారుస్తున్నట్లు శనివారం సమాచారం ఇచ్చి, అదే రోజు బదిలీల నిర్వహణ ప్రక్రియ పూర్తి చేస్తుండటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

మీరాలంపై కేబుల్ బ్రిడ్జికి అధ్యయనం

- ట్రాన్సాక్షన్ అడ్వైజరీ, ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ కన్సల్టెంట్లతో పరిశీలన
- నోటిఫికేషన్ జారీ చేసిన హెచ్ఎండీఏ

సిటీబ్యూరో, జూలై 20(నమస్తే తెలంగాణ): మీరాలం ట్యాంక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తోంది. మీరాలం చెరువును పర్యాటక ప్రాంతంగా, బెంగుళూరు హైవేకు రవాణా సదుపాయాలతో ఆధునీకరించాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలో మీరాలం బ్యూటిఫికేషన్ అప్పట్లోనూ కార్యాచరణ రూపొందించగా, తాజాగా చెరువు అభివృద్ధికి చేపట్టాల్సిన నమూనాలను తీర్చిదిద్దేందుకు కన్సల్టెన్సీని ఏర్పాటు చేసుకున్నది. దీంతో పాటు ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ తయారు చేసి, పబ్లిక్ – ప్రైవేట్ ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సమగ్రమైన విధి విధానాలను రూపొందించాల్సి ఉంటుంది. అదే విధంగా ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ఖర్చు, ట్రాఫిక్ రద్దీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని డీపీఆర్ సిద్ధం చేయాల్సి ఉంటుంది. అదే విధంగా నిర్మాణ సాధ్యసాధ్యాలు, వ్యయ, ఆదాయ వనరులపై అంచనా వేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన నిధులు, విశ్లేషణతో పాటు హెచ్ఎండీఏపై ఆర్థిక ప్రభావాన్ని తయారు చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు టోల్ కలెక్షన్, డిజిటల్ ప్రకటనలు, ప్రాజెక్టు విలువ, రెవెన్యూ మార్గాలపై ప్రత్యేకంగా సూచించాల్సింటుంది. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడంతో పాటు, ఆదాయం పెరిగేందుకు ఉండే అవకాశాలను కూడా విశ్లేషించి, హెచ్ఎండీఏకు సరిపోయే విధానాలను సంబంధిత కన్సల్టెన్సీలు సూచించాల్సి ఉంటుంది. సమీపంలో ఉండే జూ పార్క్‌ను అనుసంధానం చేస్తూ ప్రాజెక్టు డిజైన్లు రూపొందించేందుకు కన్సల్టెన్సీలు పనిచేస్తాయని హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి.

ఆరు లైన్ల రోడ్ల నిర్మాణం...

బెంగుళూరు హైవే మార్గాన్ని మరింత విస్తరించేలా ఆరులైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి హెచ్ఎండీఏ ప్రణాళికలు రూపొందించింది. బెంగుళూరు హైవే నుంచి చింతల్‌మెంట్ మీదుగా అత్తాపూర్ వరకు 2.65 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాజెక్టును నిర్మించనుంది. దీంతో ట్రాఫిక్ రద్దీ, రవాణా దూరం తగ్గిపోవడం, మీరాలం చెరువును చూసేందుకు వీలుగా ప్రాజెక్టును డిజైన్ చేశారు. దీనిపై వ్యూ డెక్, స్కై వాక్‌తో పాటు నెహ్రూ జువాలజికల్ పార్క్‌ను చేరుకునేలా డిజైన్ చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో హెచ్ఎండీఏ మీరాలం అభివృద్ధి పనులకు ట్రాన్సాక్షనల్ అడ్వైజరీ, ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకే ఈ కన్సల్టెన్సీలను నియమించనున్నట్లుగా హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, మీరాలం ట్యాంకు ఆధునీకరణలో భాగంగా సైకిల్ ట్రాక్, పెడస్ట్ర